క్లుప్తంగా

భోగితల్లి పండగ ఆరంభం



వనంగుడి నుంచి తరలిస్తున్న అమ్మవారి మూర్తులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామదేవత భోగితల్లి అమ్మవారి జాతర సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు వనంగుడి నుంచి సీతానగరం వరకూ మేళతాళాలతో ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులు అమ్మవారి మూర్తులను ఊరేగించారు. మే నెల 8 ,9,10 తేదీల్లో పండగ జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న అధికారులు

బలిజిపేట: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా బలిజిపేట పీహెచ్‌సీలో గర్భిణులకు స్థానిక సర్పంచ్ బి.రాఘలత తన సొంత నిధులతో సోమవారం ఉచితంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పీహెచ్‌సీకి ప్రతినెలా గర్భిణులు చెకప్ కోసం వస్తున్నందున వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఉచితంగా ఆహారాన్ని పంపిణీ చేస్తున్నామని సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. గర్భిణులకు పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహించి వారి ఆరోగ్యంపై వైద్యాధికారి మహీపాల్ సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ వెంకటరమణ, బి.జ్యోతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు సంఘాల సభ్యుల ఇళ్లకు జగనన్న స్టిక్కర్లు



మరిపివలసలో స్టిక్కర్లు అతికిస్తున్న పొదుపు సంఘం సభ్యులు, వీఓఏలు

సీతానగరం: పొదుపు సంఘాల రుణాల మొత్తం సొమ్మును వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా 4 విడతల్లో నేరుగా వారి చేతికే అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నేపథ్యంలో లబ్ధి పొందిన పొదుపు సంఘాల సభ్యుల ఇళ్ల గోడలకు వారి అనుమతి తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరుతో ఉన్న స్టిక్కర్‌ను అతికిస్తున్నట్లు చెప్పారు.

డీఎంహెచ్‌ఓ సందర్శన



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పాలకొండ రూరల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బగాది జగన్నథరావు అన్నారు. పాలకొండ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సోమవారం ఆయన సందర్శించారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, ఓపీ వివరాలపై ఆరా తీశారు. వేసవి నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, వడదెబ్బ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునే విధంగా వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

సీతంపేట: కోవిడ్ కేసులు పెరుగుతున్నందున ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్‌లను అందుబాటులో ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని సోమవారం ఆమె సందర్శించారు. ఓపీ, ఐపీ, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. కోవిడ్‌పై సిబ్బందిని అప్రమత్తం చేశారు. విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో 17 వెంటిలేటెడ్ బెడ్లు అందుబాటులో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఉన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌కు ప్రజామద్దతు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: వెంకటాపురంలో జగనన్నే మా భవిష్యత్తు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి జగనన్న పాలనపై ఉన్న నమ్మకంతో భవిష్యత్తులో మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని, రావాలని ప్రజలు విశ్వసించడంతో పాటు ప్రభుత్వానికి మద్దతుగా వారి ఫోన్ల ద్వారా మిస్డ్ కాల్ ఇచ్చి పూర్తిస్థాయి మద్దతు తెలపడం అభినందనీయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని నిడగల్లు, వెంకటాపురం గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభాహైమావతి, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను నేరుగా కలిసి మద్దతు కూడగడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత పొందిన లబ్ధి, చేకూరిన ప్రయోజనాలతో పాటు గతప్రభుత్వంలో ఎదుర్కొన్న ఆర్థికపరమైన సమస్యలు, మోసపోయిన విధానాన్ని వివరిస్తూ ప్రజల మద్దతును కోరుతున్నామన్నారు. ఈ మేరకు ప్రజామద్దతు పుస్తకంలో పొందుపరిచిన ఐదు ప్రశ్నలను నేరుగా అడిగి అవునని సమాధానం చెప్పినట్లయితే బుక్‌లో టిక్ మార్క్ పెట్టి వారికి రశీదులు అందించి వారితో మా భవిష్యత్, మా పిల్లల భవిష్యత్తు జగనన్నతోనే సాధ్యమని, మా నమ్మకం నువ్వే జగన్ వారంతా మద్దతు తెలపగా, వారి ఇంటి డోరుపై జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను ఫోన్‌పై స్టిక్కర్‌ను ఇంటి యజమానులతోనే అతికిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి శ్రీరాములు, వైస్‌ఎంపీపీ టి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి చిట్టి రాజు, పార్టీ మండల నాయకులు,సర్పంచ్‌లు ఎం.ధనుంజయ్, బి శ్రీనివాసరావు, బి.తిరుపతిరావు, కె.శ్రీనివాసరావు, పోల ఈశ్వర నారాయణ, గాజాపు శ్రీనివాస్, జి.లక్ష్మణరావు, బి ముకుంద, వై.గోపాలనాయుడు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



నిడగల్లులో ఇంటి హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి

బలిజిపేటలో..

బలిజిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా అజ్జాడలో ఎంపీటీసీ గణేష్, కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ గణేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమని అన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం మండలంలో..

పార్వతీపురంటౌన్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పట్టణ, మండల నాయకులు వాడవాడలా నిర్వహించారు. గ్రామాలు, వార్డుల్లో పెద్దలతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులంతా గడపగడపకు వెళ్లి. నేరుగా వారిని కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చేకూరిన లబ్ధిని వారికి వివరిస్తూ గత ప్రభుత్వంలో మోసపోయిన విధానాన్ని విడమరిచి రెండు ప్రభుత్వాలకు, అలాగే ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరిచిన ఐదు ప్రశ్నలను అడిగి సమాధానాలు తెలుసుకుని అవునని చెప్పిన వారికి రశీదు అందించారు. ప్రజల మద్దతు స్వీకరిస్తూ వారి ఇంటి గోడపై జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఫోన్‌పై అతికించారు.



సీతానగరం: జగనన్నపేరుతో ఉన్న స్టిక్కర్‌ను గోడకు అంటిస్తున్న ఇంటియజమానులు



బలిజిపేట: అజ్జాడలో ఇంటింటికి తిరుగుతున్న కన్వీనర్లు, గృహసారథులు



పార్వతీపురం టౌన్: కృష్ణపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పథకాలతో పేదలకు భరోసా



నారాయణపురంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు భరోసా కలిగిస్తున్నాయని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి ఇంకా మీ ఇంట్లో అర్హులు ఉండి సంక్షేమ పథకాలు రావడం లేదా? అని ప్రశ్నించారు. ఇంట్లో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకం అందుతోందని గ్రామస్తులు చెప్పారు. సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాభివృద్ధికి ఇంకేమైనా చేయాలా? చెప్పాలని ఎమ్మెల్యే అడుగుతుండడంతో చిన్న చిన్న సమస్యలను గ్రామస్తులు చెప్పడంతో వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అని అటువంటి నాయకుడిని తిరిగి సీఎంగా అందరం గెలిపించుకోవాలని ఎమ్మెల్యే జోగారావు ప్రజలను కోరారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఇదే తరహాలో సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ ఈ ప్రభుత్వాన్నే గెలిపించుకోవాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి, ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, ఎంపీడీఓ భాను మూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవి కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, సర్పంచ్ కె.మోహనరావు, ఎంపీటీసీ సాంబమూర్తి, పెరిక బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ రాధ, ఎంపీటీసీ శ్రీరామ్మూర్తి, కె.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత పండగకు మౌలిక సౌకర్యాలు

• స్పందన కార్యక్రమంలో వినతి



మున్సిపల్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామదేవత ఇప్పలపోలమ్మతల్లి, జగన్నాథపురం గ్రామదేవత ఎర్రకంచెమ్మ తల్లి పండగల సందర్భంగా మౌలిక సౌకర్యాలు మెరుగుపరచాలని పార్వతీపురం పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో పండగ రోజుల్లో క్రమం తప్పకుండా తాగునీరు అందించాలని కోరారు. పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగు పరచాలని, పండగ సందర్భంగా లక్షలాదిమంది భక్తులు, ప్రజలు పట్టణానికి వస్తారని మౌలికసౌకర్యాలు మెరుగుపరచకపోతే ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు.

కోవిడ్ ఎదుర్కొనేందుకు సన్నద్ధం



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి శ్యామ్‌కుమార్

కురుపాం: కోవిడ్ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్యామ్ కుమార్ అన్నారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నందున అన్ని సామాజిక ఆస్పత్రుల్లో మానటరింగ్ అధికారులను నియమించారన్నారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామన్నారు. అలాగే పీఎంఎస్‌వై కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ శ్రీధర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి

పార్వతీపురం: మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్. కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ వేడుకల్లో కలెక్టర్ నిషాంత్ కుమార్‌తోపాటు జిల్లా అధికారులు, బీసీ సంఘం నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ: మండలంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ ఎర్తింగ్ పనులు నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఓ పి. హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్కువ హెడ్ క్వార్టర్ ఫీడర్‌తో పాటు శంబర, వెంకటబైరిపురం, దుగ్గేరు, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

గ్రామదేవత పండగకు మౌలిక సౌకర్యాలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామదేవత ఇప్పలపోలమ్మతల్లి, జగన్నాథపురం గ్రామదేవత ఎర్రకంచెమ్మ తల్లి పండగల సందర్భంగా మౌలిక సౌకర్యాలు మెరుగుపరచాలని పార్వతీపురం పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో పండగ రోజుల్లో క్రమం తప్పకుండా తాగునీరు అందించాలని కోరారు.

ప్రజామద్దతు కూడగట్టాలి

భామిని: మండలంలోని లివిరి సచివాలయం వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పలు సూచనలు చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్తకోట ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించి ప్రజల మద్దతు కూడగట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సోమరాజు గోపాలరావు, బౌరి త్రినాథ్, కాగితాపల్లి కృష్ణారావు, లివిరి, బైరికాలనీ, గొల్లకాలనీ, అనంతగిరి, దిమ్మిడిజోలకు చెందిన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న సావిత్రి

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని రెల్లివీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ కార్యాలయం పరిపాలనాధికారి సావిత్రికి వినతిపత్రం అందజేశారు. సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అందుబాటులో లేకపోవడంతో ఏఓ స్పందన కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్పందనలో అందిన వినతుల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుంటామన్నారు. రెల్లివీధిలో తాగునీటి సమస్యను కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరించినట్లు చెప్పారు.

రైతుల సమక్షంలోనే సర్వేరాళ్ల ఏర్పాటు



వడ్డంగి వద్ద సర్వేరాళ్ల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

భామిని: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–శాశ్వత భూ సర్వేలో భాగంగా సర్వే పూర్తిచేసిన భూముల్లో రైతుల సమక్షంలోనే సరిహద్దు రాళ్లను పాతాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు సిబ్బందికి సూచించారు. మండలంలో వడ్డంగి, బొమ్మిక, పక్కుభద్ర గ్రామాల్లో సర్వేరాళ్లు ఏర్పాటు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. భూ వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే రాళ్లు పాతాలని సూచించారు. ముందుగా గ్రామాల్లో దండోరా వేయించి రైతులకు సమాచారం అందించాలన్నారు. మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్‌ఓ జి.వెంకటరమణ, సహాయ సర్వేయర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



రైతులకు కొర్రబియ్యంను అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు గిరిజన రైతులంతా ముందుకు రావాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య పిలుపునిచ్చారు. మండలంలోని రాయగడజమ్ము గ్రామంలో ఆదితల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులకు చిరుధాన్యాల సాగు, మార్కెటింగ్‌పై జట్టు ట్రస్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ రాగులు, సామలు, కొర్రలు, జొన్నలు, సజ్జలు మొదలగు పంటల సాగు విస్తీర్ణం పెంచాలని, ఆ పంటల్లో పోషకాలు పుష్కలంగా ఉన్నందున మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను మానవళికి అందివ్వాలన్నారు. అనంతరం సంఘ సభ్యులకు కొర్రబియ్యంను ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, సర్పంచ్ పి.అమల, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజు, ఎంటి జి.నిర్మలాదేవి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

గుమ్మలక్ష్మీపురం: పదో తరగతి విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డీవీ రమణ అన్నారు. గుమ్మలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. ఇప్పటివరకు జరిగిన పరీక్షలు ఎలా రాశారని అడిగితెలుసుకున్నారు. మిగిలిన పరీక్షలు కూడా బాగా రాసి, మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట కేజీబీవీ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని ఉన్నారు.

చెత్తసంపద కేంద్రం పరిశీలన

గరుగుబిల్లి: చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని పంటల సాగకు ఉపయోగించుకోవాలని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని గొట్టివలస ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. చెత్త సేకరణ, ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం డంపింగ్‌యార్డు పరిసరాల్లో మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను కంపోస్టుగా మర్చి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఆయనతోపాటు కార్యదర్శి భాస్కరరావు, తదితరులు ఉన్నారు.

ప్రారంభోత్సవానికి ఆలయాన్ని సిద్ధం చేయాలి



ఆలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారుల బృందం

సీతంపేట: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సీతంపేటలో నిర్మిస్తున్న దేవాలయ నిర్మాణ పనులను దేవాదాయశాఖ జేఈఓ వీరబ్రహ్మం, ఐటీడీఏ పీఓ నవ్య సోమవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి మే 4 నుంచి భక్తుల సందర్శనార్థం ఆలయాన్ని సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 29 నుంచి మహాసంప్రోక్షణ ఉంటుందన్నారు. పీఓ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో శ్రీవారి ఆలయం నిర్మించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. కల్యాణ మండపాన్ని స్థానిక గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈఓ గుణభూషణ్‌రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, జీసీసీ డీఎం సంధ్యారాణి, వీజీఓ మనోహర్ తదితరులు ఉన్నారు.

పిల్లలూ..జాగ్రత్త



కాలువలో ఈతకొడుతున్న చిన్నారులు

గరుగుబిల్లి: ఇప్పటికే పాఠశాలల్లో ఒంటిపూట తరగతులు మొదలయ్యాయి. మరోవైపు వేసవి ఎండలు రోజురోజుకు పెరుగుతున్నాయి. బడి అయిపోయాక కొందరు పిల్లలు స్నేహితులతో సరదాగా కాలువల్లో ఈతకొట్టేందుకు వెళ్తుంటారు. ఇంకొందరు ఎండలో ఆటలాడుకునేందుకు వెళ్తారు. అయితే ఈ సరదామాటున ప్రమాదం పొంచి ఉందని వారు గ్రహించలేరు. కాలువల్లో ఈత నేర్చుకునేందుకు వెళ్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అలాగే శిథిల భవనాల వద్ద ఆటలాడే సమయంలో ఆయా భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. ఎక్కువ సమయం ఎండలో తిరగడం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే బడి నుంచి వచ్చాక పిల్లలు ఎక్కడకు వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి. ఎండలో తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

- మధ్యాహ్న సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా చూడాలి. వీలైనంత ఎక్కువ సమయం విశ్రాంతి తీసుకునేలా చూడాలి.
- తల్లిదండ్రులు పిల్లల కోసం సమయం కేటాయించాలి. ఖాళీ సమయంలో పిల్లల చేత విజ్ఞానం, వినోదానికి సంబంధించిన పుస్తకాలు చదివేలా అలవాటు చేయాలి.
- ఇంటిలో ఆడుకునే ఆటలు చెస్, క్యారంబోర్డు, పజిల్స్, పరమపద సోపానం వంటివి ఆడుకునేలా అలవాటు చేయాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చినపుడు పిల్లలు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చేలా అలవాటు చేయాలి.
- ఎండలో తిరిగితే వచ్చే ఆరోగ్య సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించాలి.
- సెల్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ వంటి గాడ్జెట్స్ ఎక్కువగా ఉపయోగించడం వల్ల నేత్ర సమస్యలు, దృష్టిలోపం వచ్చే ప్రమాదం ఉంది. కావున అతిగా వాటిని వినియోగించకుండా చర్యలు తీసుకోవాలి.
- కాలువల్లో స్నానాలు చేసేందుకు వెళ్తే వారితో పాటు తల్లిదండ్రులు వెంట వెళ్లాలి.

ప్రమాదాలపై అవగాహన కల్పించాలి



ఎండలు అధికంగా ఉన్నప్పటికీ చెరువులలో, కాలువలలో నీరు పుష్కలంగావుంది. వాటిలోకి దిగితే ఎంత లోతు ఉంటుందో తెలియక మునిగిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదాలపై పిల్లలకు అవగాహన కల్పించాలి. పిల్లలకు ఈత నేర్పాలంటే కచ్చితంగా పెద్దల పర్యవేక్షణలోనే జరగాలి.

– ఎన్.నాగభూషణరావు, ఎంఈఓ, గరుగుబిల్లి



క్రికెట్ ఆడుతున్న చిన్నారులు